


# ఆమె పేరు

కొమ్మనాపల్లి గణపతిరావు

ద్వారం తెరిచిన ప్రభు అప్రతిభుడై చూశాడు. ఎదురుగా ప్రసూన నిలబడి ఉంది.

అదే నవ్వు... అప్పటి లాలిత్యమే... పెళ్లయిన నాలుగేళ్లలో మరింత ఆకర్షణగా తయారైందనిపించింది.

''రా...'' ఆలోచన పాయలు ప్రవాహ లౌతుంటే ఉద్విగ్నతని అణిచిపెట్టుకుంటూ కుర్చీ చూపించాడు.

''మీ అమ్మగారు...'' ఇల్లంతా కలియచూస్తూ అడిగింది

''ఇంట్లో లేరూ...''

''లేదు... అలిగి అక్కయ్య ఇంటికి వెళ్లిపోయింది''

పల్లెటూరు కావడంతో రాత్రి ఎనిమిది గంటలకే చాలా వరకూ సద్దుమణిగి పోయింది. దూరంగా అప్పుడప్పుడూ వినిపించే కుక్కల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

''వచ్చింది ఈవాళేనా'' అడిగాడు ప్రభు చూడకూడదనుకుంటూనే ప్రసూనని ఆపాదమస్తకం గమనిస్తూ...

ఆమె జవాబు చెప్పలేదు... జారబోయిన పైటని పిడికిట బంధించి పొంగిన పర్వతాలకు శ్వాసనందిస్తూ చూసింది.

భాష మరిచాడు ప్రభు...

ఆమె కావాలని అలా చూస్తుందో లేక అలా ప్రవర్తించడమే ఆమెకు అలవాటో వెంటనే గుర్తుకురాలేదు.

అలనాటి జ్ఞాపకాల దొంతరలు ప్రభంజనాల్లా అతడి మస్తిష్కాన్ని చుట్టుముడుతుంటే తలవంచుకున్నాడు క్షణంపాటు...

ఎందుకు చెక్కావు దేవుడూ... ఇన్ని ఒంపులతో సృష్టించిన ఆడపిల్లని బద్దలు కొట్టకూడని అద్దాలశాలగా ఎందుకు మార్చేవు...

ఒకప్పుడు ప్రసూనని ప్రేమించడమే కాదు పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నాడు... మనసు పచ్చిక బయలు పై స్వచ్ఛందంగా ఎగిరే జింక లాంటి ఆమె రూపాన్ని చూస్తూ జీవితపు అంచులదాకా కలిసి నడవాలనీ అనుకున్నాడు.

...

...శ్శబ్దపు చీకటిరాత్రి కలయిక క...ములు ఇద్దర్నీ జీవితకాలం విడదీసింది.

ఆ రాత్రి జరిగిందీ ఘోరమైనదేమీకాదు...

ప్రసూనతో అపరాత్రిదాకా మాటాడుతూ ఆమె ఇంట్లో ఒంటరిగా ఉందన్న ఆలోచనతోనో లేక బయట తగ్గుముఖం పట్టని వర్షం మూలంగానో ఆమెతో ఉండిపోయాడు.

అంతే... ఒంటరితనం శక్తినిచ్చింది. నాదంలా పొంగిన నా దానివన్న భావం ఆమెను లొంగదీసుకోవాలనీ ప్రయత్నించింది.

ఓడిపోయాడు ప్రసూన ప్రతిఘటనతో... ఒక్క రాత్రి కాదు.. శాశ్వతంగా... నిగ్రహంలేని నీలాంటి వాడికి నేను భార్యను కాలేనంటూ తనను కాదని మరో వ్యక్తికి భార్యయిపోయింది.

''గతాన్ని గుర్తు చేసుకుంటున్నా

ఉదయం సచిత్ర వారపత్రిక ఉగాది సంచిక మార్చి 22, 1991

## ఒక పిల్ల ఓడినందుకు కాదంటే మరో పిల్ల గెల్చినందుకు కాదంది... కారణం?

వా''

ప్రసూన అడిగిందో, అవహేళన చేసిందో తెలీదు తేరుకున్నాడు.

''ఒంటరిగా వచ్చావా'' అడిగాడు ప్రసక్తిని మార్చుతూ.

''లేదు... మా అబ్బాయితో'' సర్కాస్టిక్‌గా నవ్వింది.

''నీకు తెలుసుగా నాకు రెండేళ్ల కొడుకున్నాడు''

ప్రసూన పుట్టి పెరిగిందీ అదేవూళ్లో... అది కాదు ఆమె మాటల్లో మనకు పెళ్లయితే మనకీ రెండేళ్ల కొడుకుండేవాడన్న భావం ధ్వనించింది.

''సో... మీ అమ్మగారు మూడోసారి అలిగి వెళ్లారన్నమాట''

చాలా వివరాలు సేకరించిందని బోధపడిపోయింది.

''అవును... మామూలే''

''ఏమిటి... ఆమె అలగటమా లేక నువ్వు పెళ్లిని వాయిదావేస్తూ ఇలా ఒంటరిగా బ్రతకా లనుకోవడమా...'

ఈ ప్రసక్తి అతడికి నచ్చడంలేదు.

''ఎందుకు ప్రభూ... ఏం సాధిద్దామని'' ఆమె అలా జాలిపడటం మరింత అసహనానికి గురిచేసింది.

''ఇంకా నన్ను మరిచిపోలేకపోతున్నావా...'

''గర్వంగా ఉందా'' టక్కున అడిగాడు.

''దేనికి''

''అలా ఆలోచించగలిగే అవకాశం కలిగినందుకు''

''నువ్వో ఫూల్ వి...''

ఉక్రోషంగా చూశాడు.

నవ్వింది ప్రసూన "THE SILLIEST WOMAN CAN MANAGE A CLEVER MAN BUT IT NEEDS A VERY CLEVER WOMAN TO MANAGE A FOOL".

''సంతోషం ప్రసూనా''

''దేనికి''

''నువ్వు క్లెవర్ ఉమెన్‌వి కావని నీకు నువ్వుగా గుర్తించినందుకు''

''కాని సరిత క్లెవర్ గాళ్''

ప్రభు మొహం జేవురించిపోయింది.

''నాకు తెలీదనుకోకు ప్రభూ... నువ్వూ నీ మేనకోడలు సరితా ప్రేమించుకున్నారు. దానికి మీ మేనమామ అంగీకరించడంలేదు. ఎవర్నోకర్ని కట్టుకొమ్మని మీ అమ్మ అడుగుతుంటే మీ కుటుంబాల మధ్య కక్షపూరితంగా నీతో పెళ్లికిససేమిరా అంగీకరించనంటున్నాడు మీ మావయ్య... అప్పటికీ నువ్వు తెగించేవాడివేమోగానీ డబ్బూ పరపతి ఉన్న మీ మేనమామకి భయపడి నువ్వు వెనకడుగు వేస్తున్నావు... అవునా''

నిజమే... ఉన్న ఊళ్లోని షుగర్ ఫ్యాక్టరీలో ఇంజనీర్‌గా జాబ్ చేస్తున్న ప్రభు అదే ఫ్యాక్టరీ ఛైర్మన్ అయిన మేనమామకి భయపడుతున్నాడు... అయినా ఆ వాస్తవం అంగీకరించలేకపోయాడు.

''నువ్వనుకున్నది కొంతే నిజం'' చెప్పాడు చీకటిలోకి చూస్తూ.

''నీకింకా అదే అలవాటుగా మిగిలిపోయింది''

''ఏమిటి''

''సగం స్వప్నంలో బ్రతకడం...''

''కాబట్టే నిన్ను దక్కించుకోలేకపోయానేమో''

''కనీసం అప్పుడైనా మారాల్సిందిగా'' అతడి జవాబుని ఆశించకుండా గదిలోని టీవీని ఆన్ చేసింది ప్రసూన.

తెరపై గల్ఫ్‌యుద్ధం గురించి చూపిస్తున్నారు.

సముద్రజలాల్లో ప్రవేశించిన లక్షల బేరల్స్ క్రూడాయిల్లో ప్రాణాలు కోల్పోతున్న జలచరాలు.

''పాపం కదూ'' అంది ప్రసూన ఏకాగ్రతగా చూస్తూ... ''సద్దాం హుస్సేన్ దారుణమైన మార్గాల్ని అనుసరిస్తున్నాడు...''

''తప్పేంకాదు ప్రసూనా. యుద్ధమంటూ మొదలుకానంతవరకే నైతిక విలువల గురించి ఆలోచించేది. ప్రారంభమయ్యాక లక్ష్యం గెలుపు మాత్రమే...''

''గుడ్... నువ్వూ ప్రాక్టికల్‌గా ఆలోచించగలుగుతున్నావు''

''నీ అనుభవంతో నేర్చుకున్నది''

''నాతో అసలు అనుభవమే లేదుగా'' నవ్వేసింది మర్మంగా...

తొట్రుపడ్డాడు 'అనుభవమంటే అదికాదు... నీ ప్రేమలో విఫలమైన అనుభవంతో అని''

పైకి లేచింది ప్రసూన '' సంతోషంగా ఉంది ప్రభూ... సరిత కోసం నీకూ నీ మేనమామయ్యకీ మొదలైన యుద్ధంలో నువ్విటు ఒంటరివాడివైనా సద్దాంహుస్సేన్‌లా ఆలోచిస్తున్నందుకు అభినందిస్తున్నాను'' క్షణం ఆగి అంది. ''మరేంలేదు ఇందాకనే తెలిసింది. సరితకి మీ మేనమామ ఏదో పెళ్లి సెటిల్ చేస్తున్నాడని అది చెప్పడానికే వచ్చిందికూడా... సద్దాంలా ఆలోచనల స్కడ్స్‌నే మీ మావయ్యపై ప్రయోగించి ఓడిస్తావో లేక, క్రూడాయిల్ పథకంలాంటిదే పంధిస్తావో నీ ఇష్టం... సరిత లాంటి క్లెవర్ గాళ్‌నైనా పోగొట్టుకోకు''

ప్రసూన వెళ్లిపోయిందికొద్దిపాటి టెన్షనే సృష్టించింది.

ఆ మరుసటి రోజే తెలిసింది ప్రసూన చెప్పింది అబద్ధంకాదని.

సరితకి పెళ్లి సెటిల్ చేస్తున్నాడు మావయ్య.

ఆమె ఇష్టానిష్టాలతో పనిలేకుండా నిర్ణయించబోతున్నాడు.

ఇప్పుడేం చేయాలి..

ఒకనాడు ప్రసూన తనను కాదన్నప్పటి స్థితి లాంటిదే ఇది కూడా...

కానీ ఓడిపోకూడదు.

మరోసారి తన ఓటమికి సిద్ధంగా లేదు.

టీవీలో గల్ఫ్‌యుద్ధం పరిణామాల గురించి శాస్త్రవేత్తలు అభిప్రాయాల్ని తెలియజేస్తున్నారు ప్రభుకలవరపడేట్టుగా...

''నువ్వా''

అదిరిపడ్డాడు ప్రభు సమీపంలో నిలబడ్డ సరితను చూస్తూ...

అపరాత్రి దాటిన సూచనగా పల్లె నిశ్శబ్దంగా ఉంది.

''ఇలా వచ్చావేం.. అసలు ద్వారం మూసే వుందిగా''

''మనసుంటే మార్గమే దొరకదా బావా...'' ఉత్సాహంగా అన్న సరిత ఏమీ జరగనంత మామూలుగా అతడి బెడ్‌పై సెటిలై పోయింది. ''పారిపోయి వచ్చాము...తెలివిగా నీ ఇంట్లో దూరిపోయాము''

ప్రభుకి ముచ్చెమటలు పోసాయి.

రెండు రోజులుగా సరితని కలవాలని ప్రయత్నించి విఫలమైన మాట

నిజమేకాని సరిత ఇలాంటి సాహసం చేసి రావడం బొత్తిగా నచ్చలేదు.

''ఏమిటిది.. ఎందుకిలాంటి పిచ్చిపని చేశావ్''

సరితలో తత్తరపాటులేదు ''నిన్ను పిచ్చిగా ప్రేమించిన సందర్భంలో ఈ మాత్రం పిచ్చిపని చేయకతప్పని స్థితైంది.

''అదికాదు మీ నాన్నకి తెలిస్తే...''

''తెలిస్తే ఏమిటి ఉత్తరం రాసి పెట్టేవచ్చాను''

వెన్నులో మొదలైన చలి క్రమంగా అతడి రక్తంలో ప్రవేశించి దారుణమైన గగుర్పాటుకి కారణమైపోయింది.

''భయపడకు బావా... నేను మేజర్ని... డిగ్రీ మొదటి సంవత్సరం చేసే అమ్మాయి తప్పనిసరిగా మేజరే కాబట్టి మా నాన్న నిన్నేమీ చెయ్యలేడు''.

ఆ క్షణంలో మేజర్లు డిగ్రీలు, పారిపోవడాలూ కాదు... షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగం... పోలీసులూ... జనం... చెప్పుకోవడాలూ... మావయ్య కలియబడటమూ... గూండాలూ... సీరియల్‌గా గుర్తుకొచ్చాయి.

''వెళ్లిపో''

నవ్వింది అల్లరిగా...

''నిజం సరితా''

''నిజంకాదు బావా... ఇలాంటి సన్నివేశంలో నువ్విలా రియాక్ట్ కావడం చాలా సహజం''

సరిత ఇంకా అతని ఆందోళన చూసి ఏమనుకుందో వెంటనే అంది ''భయపడకు బావా... నేను ఉత్తరం రాసిపెట్టలేదు. కాబట్టి నేనిక్కడున్నట్టు నాన్నకి తెలిసే అవకాశంలేదు..''

కొద్దిగా స్తిమితపడ్డాడు ''అసలు ఇలా ఎందుకొచ్చావ్''

''ఇంటిదగ్గరే వుంటే రేపు నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోడానికి ప్లాన్ చేశాడు కాబట్టి''

మళ్లీ టెన్షన్ మొదలైంది.

ఉత్తరం రాయకపోయినా మావయ్య సులభంగా గెస్ చేయగలడు. సరాసరి ఇక్కడికే వస్తాడు... వట్టి రాద్ధాంతం మాత్రమేకాదు తన పలుకుబడితో ఎంత అల్లరికైనా సిద్ధపడతాడు...

''నా మాట విను సరితా... వెళ్లిపో''

''వీల్లేదు.. ఈ పెళ్లికి నేను అస్సలు ఒప్పుకోను''

''చెప్పు మీ నాన్నకి''

''చెప్పాను. ఇక చెప్పాల్సింది నువ్వే''

''మన కుటుంబాల మధ్య ఉన్న గొడవలు నీకు తెలుసు''

''ఈ గొడవలు మనం ప్రేమించుకోక ముందూ ఉన్నాయి''

''అదికాదు సరితా... ఇలా వచ్చి ఏం సాధిద్దామని...''

అప్పుడు చూశాడు సరిత కళ్లని... ముసురుకుంటున్న సంశయాలకి సాక్ష్యంలా ఆమె కనుకొనల్లో నీళ్లు నిలిచి ఉన్నాయి.

''నువ్వు లేకపోతే నేను బ్రతకలేను''

''అందుకని...''

''అన్నిటికీ సిద్ధపడి వచ్చాను''

ఆ తర్వాత సరిత అతడ్ని మాట్లాడనివ్వలేదు.

వయసులోయలో ఎక్కుపెట్టిన బాణంలా చీకటి అంటించిన జ్వాలలా అతడ్ని చుట్టుకుపోయింది.

ప్రభుకి ఊపిరి అందడంలేదు.

ఆలోచనల అంచుల్ని ఛేదించే ఏకాంతం అతడ్ని తొందరచేస్తూంది.

అదోలాంటి ట్రాన్స్...

కాలం కసిగా నలిగిపోతూంది.

వివస్త్రగా మారిన సరిత అసాధారణమైన అందం మరుక్షణం అతడిలోని రాక్షసుడిపై పూర్తిగా గెలుపు సాధించేదే...

అప్పుడు గుర్తుకొచ్చింది ఆమె ఏం చేస్తున్నదీ...

అది మాత్రమేకాదు... ఒకవాడు ప్రమూనదగ్గర తమా ఇలా ప్రవర్తించి మిగుల్చుకున్న బొబ్బలూ జ్ఞప్తికి వచ్చాయి.

ఆకతాయిగా అల్లరిగా ప్రవర్తించే సరితలో ఈ దూకుడు మనసులోని ఏ పొరలపై వర్తించిందో హఠాత్తుగా నైతికవిలువలు తలపుకి వచ్చాయి.

నెట్టేశాడు ఆవేశంగా...

ఆమె ఉక్రోషంగా చూసింది.

అంతేకాదు... వగ్నంగా నడిచి గదిలో కూర్చుంది.

''చీరకట్టుకో...'' అరిచాడు రొప్పుతూ.

''దేనికి''

''నిన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేసేస్తాను''

''కట్టుకోను''

''మీ నాన్న వస్తాడు''

''రానియ్ ఇలాగే ఉంటాను''

''నా మాట విను...''

''నువ్వు లక్ష చెప్పు... నేనిలా వగ్నంగానే కూర్చుంటాను'' మొండిగా అంది. వెళ్లలేకపోయాడు గదిలోకి ఆమెను బలవంతంగా ఇంటికి పంపాలనుకున్నా అవకాశంలేని స్థితి. మరోసారి ఆమె నలా చూసి తట్టుకోలేనన్న భయమో ఆమె అలా ప్రవర్తించడంపై ఏహ్యభావమో చేష్టలుడిగి నిలబడిపోయాడు.

ఎంతసేపలా గడిపాడో అతడికీ గుర్తులేదు...

బయట అడుగుల చప్పుడు... జనం పోగయ్యారు మావయ్యతో సహా...

దూకుడుగా లోపలికి వచ్చిన మావయ్య లోపలి పరిస్థితిని గమనించి తను మాత్రమేకాదు తన మనుష్ళ్ని వెళ్లనివ్వక కొందరు ముత్తయిదువుల్ని పంపేడు సరితకి చీరకట్టి బయటికి తీసుకురమ్మని...

బిడియంగా తలవంచుకున్నాడు ప్రభు.

''జరగకూడని దేమీ జరగలేదు మావయ్యా. నైతిక విలువలంటే ఉన్న గౌరవంకొద్దీ నా పరిహద్దుల్లోనే నేను నిలబడి ఉన్నాను''


జవాబు చెప్పలేదు సరిత తండ్రి.

భుజంపై తట్టి వెళ్లిపోయాడు.

తామిద్దరి మధ్యా ఉన్న పోరాటం ఓ కొలిక్కి వచ్చినంత సంతృప్తి ప్రభు కళ్లల్లో...

''అలా భ్రమపడుతున్నావుకానీ నిజానికి నువ్వు సరితని దూరంగా నెట్టింది నైతికవిలువలు పాటించాలనే ఉద్దేశ్యంతో కాదు'' ఖండితంగా అంది ప్రమూన.

ఫ్యాక్టరీనుంచి మధ్యాహ్నం భోజనానికని ఇంటికి వచ్చిన ప్రభు తన





ఇగో మగవాడినీ, వానిటీ ఆడదానినీ నాశనం చేస్తుంది. —లత

ము కలిసిన ప్రసూన ఇలా మాటాడ్డాన్ని అంగీకరించలేకపోయాడు..

"మరెందుకంటావ్" ఉక్రోషంగా అడిగాడు.

క్షణం ఆగి అంది ప్రసూన "తెల్లవారగానే ఊళ్లో కొందరు రాత్రి జరిగిన సంఘటన గురించి చెప్పుకుంటూ నిన్ను అభినందిస్తూ సరిత బరితెగించిన గుణాన్ని తెగుడుతూ మాట్లాడ్డం వినగానే అనుకున్నాను నువ్వు పర్యవసానానికి భయపడి సరితని దూరంగా పెట్టావే తప్ప ఆమెశరీరంపై ఇష్టంలేక కాదు"

"నాన్సెన్స్..." అసహనంగా చూశాడు" నా గురించి నువ్వింతకన్నా ఆలోచించలేవు"

"నీ గురించి నీ కన్నా నాకే ఎక్కువ తెలుసు ప్రభూ... నువ్వాచరించిన నైతిక విలువన్నది నీ అంతట నువ్వుగా అనుసరించాలనుకున్నది కాదు... నా దగ్గర నామూలంగా నేర్చుకున్నది"

"నో..."

"ఆవేశపడకు... ఆ రాత్రి అంటే నువ్వు నన్ను లొంగదీసుకోవాలని ప్రయత్నించిన రాత్రి... నువ్వు నా గదిలో ఉన్నది నేను రప్పిస్తే కాదు... బయట కుంభవృష్టి మూలంగా ఇంటికి వెళ్లలేక లేదా నా ఒంటరితనాన్ని క్యాష్ చేసుకుందామని". కానీ నిన్న రాత్రి సరిత నీ దగ్గరకు వచ్చింది తనంతట తానుగా అంటే కోరి నీ దగ్గర అంతటికీ సిద్ధపడి..."

ప్రసూన ఏ విషయం చెప్పాలని ఇలా విశ్లేషిస్తోందో అర్థంకాలేదు... సాలోచనగా చూస్తూ అన్నాడు. "అవును... అంత మాత్రం చేత ఎలా అంగీకరించను..."

"మరి ఆ రోజు నేనెలా అంగీకరిస్తాననుకున్నావ్"

బాంబ్ పడ్డట్టు అదిరిపడ్డాడు.

"మరోలా అనుకోకు ప్రభూ... ఒకనాడు సులభంగా నన్ను లొంగదీసుకోవాలనుకున్న నువ్వు ఈ రోజు సులభంగా నీకు లొంగాలనుకున్న సరితలో పవిత్రతని శంకించివుంటావ్. అలా చూడకు... కాబోయే భర్తతో ఆ దూకుడు ఆమెపై నీకు చిన్నచూపు ఏర్పడేట్టు చేసింది. అది మాత్రమేగాక నువ్వు భయపడి మీ మావయ్య ముందు నీ కేరెక్టర్ నిరూపించుకునే అవకాశాన్నీ అందించింది"

"లేదు..."

"నేనూహించగలను ప్రభూ... ఆ రాత్రి మీ మావయ్య రాకపోయి నా సరిత అలా ఉండిపోతే బహుశా నీ అంతట నువ్వే మీ మావయ్యని పిలిచేవాడివి... సో నీ చేష్టకి అర్థం లేకాఫ్ ఆపర్ట్యునిటీ అన్నది నా అభిప్రాయం తప్ప అది నైతిక విలువా కాదు పాడూ కాదు..."

ఎందుకో మొండిగా వాదించలేకపోయాడు "నువ్వు నన్ను అర్థం చేసుకోలేవు"

"ఇక్కడ నా ఉద్దేశ్యం నా ఆలోచనా సరళి ఎంత గొప్పదో నీకు తెలియ చెప్పడంకాదు ప్రభూ... సందర్భోచితంగా తెలివినెందుకు ప్రదర్శించలేకపోయావా అని బాధపడుతున్నాను" బాధగా తలవంచుకుంది ప్రసూన. "ఇందాక సరితని కలుసుకున్నాను"

భావరహితంగా కాదు నిశ్చేష్టుడిలా చూశాడు.

"నైతిక విలువల్ని పాటించడమనే హిపోక్రసీతో సరిత బాధపెట్టావ్ తప్ప నిన్ను కోరిన ఆమెనే నువ్వు కాదన కుండా దగ్గరకు తీసుకుని ఉంటే మానసికంగానే కాక శారీరకంగా నీకు కమిట్ అయ్యేది ప్రభూ... ఒకనాడు ప్రసూన అలా ఆలోచించినపుడు ఈరోజు సరిత ఇలా ఆలోచించడమేమిటీ అనుకోకు... మా ఇద్దరి వ్యక్తిత్వాల్లోనూ ఉన్న తేడా అది.. ఒకవేళ నువ్వు ఆమె కోరిక మన్నించి ఉంటే తన కోసం నువ్వేమన్నా చేయగలవన్న ఆలోచనతో బహుశా ప్రపంచాన్నే ఎదిరించేది"

ఏమిటి ప్రసూన ఇలా ఆలోచిస్తోంది.

"అమ్మాయిల మనస్తత్వాన్ని తెలుసుకుని బ్రతకగలగటం ఓ కళ ప్రభూ... అందర్నీ ఓ గాట కట్టి ఒకే ఆర్గ్యుమెంట్‌తో అందరికీ జవాబు చెప్పాలనుకున్న మగాడు మనిషి అవుతాడేమో తప్ప మంచి భర్త కాలేడు..."

"ఇదంతా ఎందుకు చెబుతున్నట్టు"

"పోరాటమంటూ మొదలయ్యాక నైతికవిలువలకి అర్థం లేదంటూ సద్దాం హుస్సేన్ చర్యల్ని సమర్థించిన నువ్వు నీ బ్రతుకుపోరాటంలో తప్పటడుగు వేశావ్..."

"లేదు"

"సమర్థించుకోకు... ఎప్పుడో కువైట్ అనబడే ఓ ఆడపిల్లని ఆక్రమించుకోబోయి ఆమెను కోల్పోయిన నువ్వు ఇప్పుడు కువైట్ తనంతట తానుగా నీ ఆశ్రయం కోరివస్తే కాదని మరోసారి ఓడిపోయావ్"

"లేదు... ఇది ఓటమి కాదు... సరిత నా భార్యవుతుంది"

బాధగా నవ్వింది "అంతా కోల్పోతున్నా ఇంకా గెలుపు తనదేనన్న సద్దాం హుస్సేన్‌లా కనిపించకు ప్రభూ..."

"నీ నైతిక విలువలకి మీ మావయ్య అణువంత ఆనందాన్ని ప్రకటించిన మాట నిజమే అయినా సరిత నిన్ను కాదనేసింది ప్రభూ... తండ్రి చూసిన వ్యక్తికి భార్య కావాలని నిర్ణయించుకుని తండ్రికి చెప్పింది. నిశ్చయ తాంబూలాల కార్యక్రమం పూర్తయిపోయింది అప్పుడే"

కంపించిపోతున్న ప్రభు కళ్లల్లో తడి ఆమెను కదిలించలేదు.

"నీకు తెలీదు ప్రభూ... నెమ్మదిగా అంది ప్రసూన "ఆ రోజు నిజానికి నిన్ను నేను కాదన్నది నువ్వు పాటించని నైతిక విలువల గురించి కాదు... కొద్దిపాటి నా ప్రతిఘటనకే నువ్వు కంగారుపడి దూరం జరిగినందుకు... ఎస్... ఆ మాత్రం గెలుపు సాధించలేని మగాడ్ని ఆడపిల్ల ఇష్టపడదు...."

షాక్ తిన్నట్టుగా చూశాడు.

ఇన్నేళ్ల తన ఆలోచనలకి ఇప్పుడు కొత్త అర్థం చెబుతున్న ప్రసూన వెళ్లిపోయింది షేక్‌స్పియర్ సూక్తిలా...

"ఆమె పేరు ఆడది. అందుకే వేడుకోవాలి"

"ఆమె పేరు ఆడది.. అందుకే గెలుచుకోవాలి"

